
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 23 ఆగస్టు 2025



15 వేల గృహాలకు సోలార్ పవర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కడప కార్పొరేషన్ పరిధిలో 15 వేల గృహాలకు సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసే లక్ష్యంతో విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. కడప నగరానికి మణిహారంలా బుగ్గవంకను తీర్చిదిద్దుతామని తెలిపారు. బుగ్గవంక పరివాహక ప్రాంతాన్ని బ్యూటిఫికేషన్‌లో భాగంగా అత్యంత పరిశుభ్రంగా తయారు చేస్తున్నామని పేర్కొన్నారు.

రైతులందరికీ సాగునీరు అందిస్తాం : కలెక్టర్



బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ తదితరులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ పరిధిలో ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందిస్తామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలిసి బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. కుడి, ఎడమ కాల్వల స్థితిగతులపై తెలుగుగంగ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. బ్రహ్మంసాగర్ నుంచి నేరుగా చెరువులు, పంట పొలాలకు నీళ్లు వృథా కాకుండా ఎంత మేరకు వెళుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అలాగే బ్రహ్మంసాగర్‌లో ప్రస్తుత నీటి మట్టం, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఎన్ని నీళ్లు వస్తున్నాయి, కుడి ఎడమ కాల్వల నుంచి పంట పొలాలకు ఎన్ని క్యూసెక్కులు వెళుతున్నాయి అనే విషయాలపై ఆరా తీశారు. రాబోవు రోజుల్లో తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా 15టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతామన్నారు. పోరుమామిళ్ల, బద్వేలు ప్రాంతాల్లోని ప్రధాన చెరువులను పూర్తిగా నింపి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తామన్నారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరామయ్య, బద్వేలు డివిజన్ ఈఈ మధుసూదనరెడ్డి, డీఈ, ఏఈలు, తహశీల్దారు కార్తీక్, ఎంపీడీవో వీరకిశోర్, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, సర్పంచ్ నారాయణ, సింగిల్‌విండో చైర్మన్ యల్లటూరు సాంబశివారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

కడప జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ఠ పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

23, 24, 25, తేదీల్లో కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన, ఎస్.పి బంగళా ఎదురుగా, హరితా హోటల్, ఎపి టూరిజం, కడప నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (**సైజును బట్టి చార్జి చేయబడును**). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లినిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కటేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

యూరియా కొరత లేదు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ సీజన్లో పండించే పంటలకు సంబంధించి యూరియా, ఎరువుల కొరత లేదని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జేసీ అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల డిమాండ్ ఆధారంగా ఎరువులను ఆర్ఎస్‌కేల ద్వారా అందజేస్తామన్నారు. బల్క్ స్టాక్ పెట్టుకుని కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటికే 12 ఎరువుల దుకాణాలపై కేసులు నమోదు చేశామన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అమ్మాలన్నారు. వారి డిమాండ్‌ను ఆసరాగా తీసుకొని వేరే ఉత్పత్తులను, పోషకాలను లింక్ చేసి అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఈ నెలలో 15 రోజులు ముందుగానే కేసీ కెనాల్ బెల్ట్‌లో సాగు మొదలైందన్నారు. రైతుల సమస్యల పరిష్కారంకోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 8331057300 ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా.. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో ప్రైవేట్ ఫెర్టిలైజర్స్ డీలర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 430 ఎరువుల దుకాణాలు ఉన్నాయని, ఎంఆర్పీ ధరలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యూరియాతో పాటు నానో కాంప్లెక్స్ ఎరువులను జతచేసి అమ్మితే డీలర్లపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

స్వర్ణాంధ్ర సాధనకు కృషి

కడప కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను సాధించేందుకు, జిల్లా వృద్ధి రేటు పెంచేందుకు అధికారులు కృషిచేయాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారానికి అధికారులు కృషి చేయాలన్నారు. అన్ని రంగాల్లో వృద్ధిరేటు 15 శాతం సాధించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా ఉద్యాన, వ్యవసాయ, పరిశ్రమల రంగాల్లో పురోగతి సాధించాలన్నారు. స్వర్ణాంధ్ర ఆన్‌లైన్ పోర్టల్‌లో వివిధ శాఖలు నమోదు చేసిన లక్ష్యాలను శాఖల వారీగా పరిశీలించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లా, మండలాల వారీగా ఈ ఏడాది సాధించిన లక్ష్యాలను, 2025-26 సంవత్సరానికి సంబంధించి నెల, నాలుగు నెలలు, సంవత్సరానికి టార్గెట్లను పరిశీలించారు. పర్యాటక, పశుసంవర్థక శాఖ, సెరికల్చర్, వైద్య ఆరోగ్య శాఖ, మార్కెటింగ్, ఆయుష్, ఇరిగేషన్, పరిశ్రమలు, పంచాయతీ రాజ్‌తో పాటు వివిధ శాఖలు సాధించిన లక్ష్యాలను, వచ్చే ఏడాదికి విధించిన టార్గెట్లపై అధికారులతో జేసీ చర్చించారు. ఈ కార్యక్రమంలో పీపీవో హజరత్తయ్య, పరిశ్రమల జీఎం చాంద్ బాష, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, పశుసంవర్థక శాఖ జేడీ శారదమ్మ, పర్యాటక శాఖ అధికారి సురేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పాల్గొన్నారు.

జోరందుకున్న వరినాట్లు

- లక్ష్యం 30,804 హెక్టార్లు
- ఇప్పటికి 8వేల హెక్టార్లలో సాగు



కేసీ కెనాల్ కింద బచ్చుంపల్లిలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

కడప రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల కారణంగా నిన్నటి వరకు వరిసాగు చతికిలపడింది. ఈ నెల మొదటి వారం నుంచి వర్షాలు కురుస్తుండడంతో వరిసాగు ఊపందుకుంది. ఇటీవల జిల్లాలో కురిసిన ఓ మోస్తారు వర్షాలతో పాటు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో వరిసాగు నెమ్మదిగా పుంజుకుంటోంది. ఇప్పటివరకు దాదాపు 8వేల హెక్టార్ల వరకు పంట సాగైంది. ఇందులో అత్యధిక శాతం కేసీ కెనాల్ ఆయుకట్టుకింద, పెన్నానదీ పరివాహక ప్రాంతాల్లో మాత్రమే సాగులోకి వచ్చింది. ఎగువ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే కేసీ కెనాల్‌కు నీటి విడుదల పెరిగింది. దీంతో మరికొంత విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 7,7475 హెక్టార్ల సాగు లక్ష్యం కాగా ఇందులో ప్రధానమైన వరి పంట 30,804 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉంది. అయితే ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. ప్రతి నెలా సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదవుతూ వచ్చింది. దీంతో బోరుబావుల కింద వరి నామమాత్రంగా సాగైంది. రెండువారాలుగా కురుస్తున్న వానలతో వరినాట్లు వేగం పుంజుకోవడంతో ఇప్పటికే దాదాపు 8వేల హెక్టార్లలో సాగుకు నోచుకుంది. మిగిలిన 23వేల హెక్టార్లు సాగు లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు. కేసీ కెనాల్ కింద దువ్వూరు, మైదుకూరు, చాపాడు, రాజుపాలెం, చెన్నూరు, కడప తదితర మండలాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. అలాగే పెన్నానది పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో కూడా వరినాట్లు పడుతున్నాయి.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనకు సర్వం సిద్ధం

- 17 టీములు, 30 మంది వలంటీర్లు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 సర్టిఫికెట్ల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. కడప నగరం బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన చేసేందుకు 17టీంలను, 30 మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని డీఈవో షంషుద్దీన్ తెలిపారు. సమాచారం అందుకున్న అభ్యర్థులు పరిశీలన నిమిత్తం వారికి కేటాయించిన తేదీలలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో హాజరుకావాలని చెప్పారు. అభ్యర్థులు తప్పకుండా వారి లాగిన్‌లో హెచ్‌టీటీపీఎస్://ఏపీడీఎస్సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఇంటిమేషన్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఐదు పాస్‌పోర్టు ఫొటోలతో పరిశీలనకు హాజరుకావడానికి ముందే తప్పకుండా సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే పరిశీలన సమయంలో సంబంధిత పత్రాలన్నీ (అటెస్టెడ్ 3సెట్స్) ఒక ఫోల్డర్‌లో భద్రపరిచి ఫోల్డర్‌పైన హాల్ టికెట్ నెంబర్, పేరు రాసి సమర్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు, దాదాపు 68 మందితో 17టీములు, వెరిఫికేషన్ సభ్యులతో పాటు 30 మంది వలంటీర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

తాళ్లపాక అభివృద్ధికి అడుగులు

● అన్నమయ్య జన్మస్థలిపై టీటీడీ దృష్టి ● తాళ్లపాకను అభివృద్ధి చేయాలని నిర్ణయం ● క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారుల పరిశీలన





తాళ్లపాక గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అన్నమయ్య ధ్యానమందిరం

రాజంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు, శ్రీవారిపై 32 వేల సంకీర్తనలు రచించిన తాళ్లపాక అన్నమాచార్యుల గ్రామ అభివృద్ధిపై తిరుమల తిరుపతి దేవస్థానం దృష్టి సారించింది. వైసీపీ హయాంలో కొత్తగా ఏర్పడిన జిల్లాకు అన్నమయ్య పేరు పెట్టినా.. ఆయన జన్మస్థలి అయిన తాళ్లపాక అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాళ్లపాక అభివృద్ధిపై టీటీడీ దృష్టి సారించింది. అన్నమయ్య జన్మస్థలిని అభివృద్ధి చేయకుండా జిల్లాకు ఆయన పేరు పెట్టినంత మాత్రాన ఉపయోగం ఏమిటని ఇటీవల కూటమి నేతలు టీటీడీ పాలకమండలి దృష్టికి తీసుకుపోయారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, స్థానిక తాళ్లపాక గ్రామవాసి, పాలిటెక్నికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఉద్దండం సుబ్రమణ్యం తదితరుల ఆధ్వర్యంలో తాళ్లపాక సమస్యలను, చేయాల్సిన అభివృద్ధి పనులపై పాలకమండలికి వినతిపత్రం ఇచ్చారు.

16 సమస్యలపై అధ్యయనం

ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో తాళ్లపాకలో సమస్యలను పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి చేసి అన్నమయ్య ఖ్యాతిని ఇనుమడింపజేయాలని నిర్ణయించారు. వెంటనే ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసి అందుకు సంబంధించిన నివేదికలను టీటీడీకి సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఇటీవలే టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు తాళ్లపాక గ్రామాన్ని సందర్శించి సమస్యలను అధ్యయనం చేశారు. ప్రధానంగా 16 సమస్యల పరిష్కారానికి నివేదికలు తయారు చేయడానికి టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు.

నివేదికల తయారీ

కడప చెన్నై జాతీయ రహదారిలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద నుంచి తాళ్లపాక గ్రామం వరకు రోడ్డును వెడల్పు చేసి డివైడర్లు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి. ఈ రోడ్డులో అన్నమయ్య, శ్రీవారి ప్రతిమలను ఏర్పాటు చేయాలి. ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు సెంట్రల్ లైటింగ్, తాళ్లపాక చెరువు మధ్యలో అన్నమయ్య పదవికతలను రాస్తున్నట్లు భారీ విగ్రహం ఏర్పాటు చేయాల్సి ఉంది.

గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అన్నమయ్య ధ్యాన మందిరాన్ని కొత్తగా ఏర్పాటు చేయాలని, అన్నమయ్య పూర్వీకులు ఉన్న ఇంటి ప్రాంతంలో ఒక కుటీరం, గ్రామంలో సంగీత కళాశాల, శ్రీవారి ఆలయాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. నిత్యం అన్నమయ్య సంకీర్తనలను వినిపించాలని, అన్నమయ్య ఇలవేల్పులైన చెన్నకేశవ, సిద్ధేశ్వర ఆలయాలను అభివృద్ధిపరచాలని, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాళ్లపాకను ఆధ్యాత్మిక కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. వీటన్నింటిపై టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేస్తున్నారు. ఈ నివేదికల ఆధారంగా తిరుమల తిరుపతి వేదస్థానం నిధులు మంజూరు చేసి తాళ్లపాక గ్రామాన్ని అభివృద్ధి చేస్తే జిల్లాకు అన్నమయ్య అని పేరు పెట్టినందుకు సార్థకత ఏర్పడుతుంది.

విజ్ఞప్తులను టీటీడీ ఆమోదించింది



ఇటీవల టీటీడీ చైర్మన్, ఈవోలను కలిసి అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక అభివృద్ధిపై 16 సమస్యలతో కూడిన నివేదికను సమర్పించాం. వీటి ఆధారంగా సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి టీటీడీ ఆమోదించింది. ఇటీవల ఇంజనీరింగ్ అధికారులు తాళ్లపాకను సందర్శించారు. వీరు నివేదికలు ఇచ్చిన వెంటనే తాళ్లపాక అభివృద్ధి శరవేగంగా జరగనుంది.

- పోతుగుంట రమేశ్‌నాయుడు,
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజంపేట

తాళ్లపాకను అభివృద్ధి చేయకపోతే ఎలా



గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసే క్రమంలో అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసింది. జిల్లాకే ఆయన పేరు పెట్టి ఆయన స్వగ్రామాన్ని అభివృద్ధి చేయకపోతే ఎలా అని మేము ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిని, అధికారులను కలిసి విన్నవించారు. దీంతో వారు తాళ్లపాక గ్రామ అభివృద్ధికోసం ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామం.

- ఉద్దండం సుబ్రహ్మణ్యం,
పాలిటెక్నికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, తాళ్లపాక

టమోటా మార్కెట్‌లో సమస్యలేంటి ?

● సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆరా



మదనపల్లె మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌లో రైతులు, ట్రేడర్స్ ట్రాఫిక్ సమస్యలు ఏమేమి వున్నాయంటూ సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆరా తీశారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె యార్డు అంతటా తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక క్రేట్‌కు ఎన్ని కిలోల టమోటాలు పడతాయి, వేలం పాటలు ఏవిధంగా జరుగుతున్నాయంటూ ప్రశ్నించారు. సీజన్‌లో 2 వేల టన్నుల దాకా టమోటా విక్రయానికి వచ్చినప్పుడు నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ట్రేడర్లు సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. ఇటీవల 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మదనపల్లె మార్కెట్‌ను పరిశీలించినప్పుడు చేసిన సూచనల గురించి ట్రేడర్లు సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం యార్డు శివారులోని సివిల్ సప్లైస్ గోదామును సబ్‌కలెక్టర్ పరిశీలించి స్టాకు వివరాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో నవీన్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు కార్యదర్శి జగదీష్, అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఆస్తుల స్వాధీనానికి కృషి

● జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్



ప్రభుత్వాసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ విశ్వనాథ్

బి.కొత్తకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్యాక్రాంతమైన దేవదాయశాఖ ఆస్తుల స్వాధీనానికి కృషి చేస్తూ, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మండల స్పెషలాఫీసర్‌గా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం ఆయన బి.కొత్తకోటలో పర్యటించారు. పీహెచ్‌సీగా వుంటూ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌గా రూపాంతరం చెందిన ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు ఆరీఫుల్లా, ఫార్మసిస్టు సునీల్‌కుమార్‌లతో మాట్లాడి, ఆసుపత్రిలో వైద్యసదుపాయాలు, సిబ్బంది కొరత, అధునాతన పరికరాల లభ్యత, వివిధ రకాల మందుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషలాఫీసర్ హోదాలో ఆసుపత్రి తనిఖీ చేశాన న్నారు. జిల్లాలో శ్రీవాణి పథకం ద్వారా 230 ఆలయాలకు రూ.10లక్షల చొప్పున అభివృద్ధి పనులకు నిధులు మంజూర య్యాయన్నారు. అదే విధంగా కొన్ని ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కోసం నెలకు రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి : ఎండీ

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, విద్యుత్ ప్రసారంలో అంతరాయాలు నివారించడంతో పాటు లోటర్జీ సమస్యలు తీర్చాలని సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోశ్‌రావు సూచించారు. పట్టణంలోని రాజధాని కల్యాణ మండపంలో శుక్రవారం ప్రజా సానుకూల అవగాహనపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లాలోని రాయచోటి, రాజంపేట, పీలేరు, మదనపల్లె డివిజన్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు దేవుళ్లతో సమానమని, వినియోగ దారులతో సత్సంబంధాలను కొనసాగించాలని తెలియజేశారు. ఈ సదస్సులో చీఫ్ జనరల్ మేనేజర్ జానకీరామ్, ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై సమీక్ష నిర్వహించి మండల అధికారులకు ఆ సెక్షన్‌లో పనిచేసే సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యుగంధర్, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గంగాధర, డిప్యూటీ ఇంజనీర్స్ అసిస్టెంట్ ఇంజనీర్స్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ సంతోశ్‌రావు

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రసాయనిక ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ యూరియా కొరత రానివ్వకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రసాయనిక ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా తగినన్ని నిలువలు లేవని నివారించినా సంబంధిత సంస్థలపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన రసాయనిక ఎరువుల కొరత రానీయకుండా సిద్ధంగా ఉంచుకోవాలని వ్యవసాయ అధికారు లను ఆదేశించారు. అన్ని మండలాల్లో బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టాలని కలెక్టర్ సూచించారు.

నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి: ఎస్పీ



కోర్టు కానిస్టేబుల్స్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపర్చి బాధితులకు న్యాయం జరిగేలా సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీస్‌స్టేషన్‌లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టుల్లో చార్జ్‌షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతనంగా అమలులోకి వచ్చిన బీఎన్‌ఎస్ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. కోర్టు ట్రయల్ సందర్భంలో సంబంధిత స్టేషన్ హౌస్ అధికారి కూడా సమర్థవంతంగా కేసు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఈ సాక్ష్య, ఈ సమన్లు అమలు చేయడం కోసం, నేర స్థలంలో ఫొటోలు, వీడియో రికార్డింగ్ చేయడం కోసం, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించిన అత్యాధునిక ట్యాబులను ఎస్పీ ఆయా స్టేషన్ల సిబ్బందికి అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎ.ఆదినారాయణరెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరామ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి.రాజారమేశ్, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ టి.మధు, ఎస్‌ఐ రవికుమార్, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

12 అంశాలతో కళా ఉత్సవ్ పోటీలు

● జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి



రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్న జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి, తదితరులు

రాయచోటిటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా 12 అంశాలతో కళాఉత్సవ్-2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో కళాఉత్సవ్-2025కు సంబంధించి రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాలకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని ఆయన వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు రాయచోటి డైట్ కేంద్రంలో వ్యక్తిగతంగా కానీ, 9440246825 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కానీ, గూగుల్ ఫామ్ ద్వారా కానీ తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబుయాదవ్, శివప్రసాద్, కలీముల్లా, మోహన్‌నాయక్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల వివరాల మేరకు.. చంద్రామాకులపల్లెకు చెందిన రామచంద్ర (48) డయాలసిస్ చేయించుకునేందుకు శుక్రవారం ఇంటి నుంచి బైకులో వెనెకవైపు కూర్చోని మదనపనల్లె ఆస్పత్రికి బయలుదేరారు. బసినికొండ వద్ద మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు కిందపడిపోయాడని, వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. కాగా మృతుడికి పిల్లలు లేరని, భార్య ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగులపై విచారణ

కలికిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అనుబంధ పత్రాలను అందజేయడంతో పాటు వాటి గురించి 15 రోజుల్లోగా వివరణలు సమర్పించాలని ఆదేశిస్తూ శుక్రవారం ఆరుగురికీ నోటీసులు జారీ చేసింది. 2022 ఆగస్టు 4న రాజంపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరుగురు ఉద్యోగులకు సంబంధించి పలు ఉల్లంఘనలను ఏసీబీ గుర్తించింది. మున్సిపాలిటీ ఇన్‌చార్జీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ చంద్రగిరి లక్ష్మీనారాయణమ్మ, మున్సిపాలిటీ కార్యాలయం మేనేజరు పెద్ది శేషఫణి, సీనియర్ అసిస్టెంట్ బాలంహరినాథ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూల వెంకటమధుసూదన్, ఎన్నసూరు వెంకటరామకృష్ణ, లైటర్ ఇన్‌చార్జి షరాఫ్ షేక్ జమీల్ అహ్మద్‌లపై వేర్వేరు అభియోగాలు ఉన్నాయి. ఈ ఆరుగురి నుంచి సంజాయిషీలు అందిన తరువాత ప్రభుత్వం తదుపరి చర్యలకు ఉపక్రమించనుంది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఆరుగురికీ విడివిడిగా నోటీసులు జారీ చేశారు.

రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శిగా నాగోతు రమేశ్‌నాయుడు



నాగోతు రమేశ్‌నాయుడు

రాజంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా రాజంపేటకు చెందిన నాగోతు రమేశ్‌నాయుడును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవన్ నియమించారు. రమేశ్‌నాయుడు ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కొత్తగా రాష్ట్రంలో నలుగురు ప్రధాన కార్యదర్శులను నియమించిన సమయంలో అన్నమయ్య జిల్లా నుంచి ఈయనకు స్థానం కల్పించారు. ఆయన విద్యార్థి దశ నుంచే ఏబీవీపీ నాయకుడిగా, డిగ్రీ కళాశాల చైర్మన్‌గా, కూచివారిపల్లె సర్పంచ్‌గా బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా పోటీ చేశారు.

అవగాహనతోనే ఎయిడ్స్‌కు దూరం

● జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఐఈవో రవి, తదితరులు

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని దూరం చేయవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) రవి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి పర్యవేక్షణలో జిల్లాలోని ఇంటర్మీడియట్ కళాశాలల నుంచి విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు మొదటి బహుమతి కింద రూ.5 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.3 వేలు, తృతీయ బహుమతి కింద రూ.2 వేల చొప్పున అందజేశారు. అనంతరం డీఐఈవో మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు కళాశాలతో పాటు చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు.

హైరిస్క్ గర్భిణీలను గుర్తించండి

● వైద్యుల శిక్షణలో డీఐవో డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎక్కువ ప్రమాదం గల గర్భవతుల జాడలను గుర్తించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యులకు ఎక్కువ ప్రమాదం గల గర్భవతుల జాడలను గుర్తించి వారికి సుఖప్రసవం నిర్వహించడంపై మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలో శిక్షణ పొందిన వారితో జిల్లాలో పనిచేస్తున్న వైద్యులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా మాతాశిశు మరణాలను తగ్గించడంలో భాగంగా వైద్యులకు ఇటువంటి శిక్షణలు ఇచ్చి వారి ద్వారా ప్రమాద సంకేతాలు గల గర్భవతుల ఆరోగ్య పరిస్థితిపై నెలావారీగా ట్రాక్ చేసి సుఖప్రసవం అయ్యే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షకులు డాక్టర్ కిజియా, డాక్టర్ లీల తదితర వైద్యులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ముగ్గురు మహిళల అరెస్టు

కలికిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కలికిరి పంచాయతీ తుమ్మలపేట వడ్డెపల్లె గ్రామంలో ఒక వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించి కలికిరి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో శుక్రవారం ముగ్గురు మహిళలను అరెస్టు చేశారు. కలికిరి ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ వివరాల ప్రకారం.. గత బుధవారం గ్రామానికి చెందిన ఆవుల రామయ్య, సనపతి రమేష్, ఆవుల రత్నమ్మ, సనపతి అంజనమ్మ, ఆవుల సరోజమ్మలు కోళ్ల దొంగతనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన పసుపులేటి చంద్రశేఖర్ అనే వ్యక్తి కనుక్కొని వారిని పట్టుకునేందుకు యత్నించాడు. దీంతో తమ వద్ద వున్న కొడవలితో అతనిపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారు. దీంతో చంద్రశేఖర్ గట్టిగా కేకలు వేయడంతో ద్విచక్రవాహనంలో నిందితులు పారిపోయారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎస్టీ కాలనీ సమీపంలో వున్న రత్నమ్మ, అంజనమ్మ, సరోజమ్మలను సిబ్బందితో కలిసి వెళ్లి సీఐ అనిల్‌కుమార్ అరెస్టు చేశారు. నిందితుల వద్ద కోళ్లు, కొడవలి స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ మదనమోహన్ రెడ్డి, పీసీలు మహ్మద్ అలీ, సరస్వతి, రెడ్డికుమారి, దినేష్‌కుమార్‌లు నిందితులను పట్టుకోవడంలో కృషి చేశారని, వీఆర్వో ప్రసాద్ రెడ్డి, వీఆర్‌ఏ మల్లికార్జునల సమక్షంలో పంచనామా నిర్వ హించినట్లు సీఐ వివరించారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): టి.సుండుపల్లె మండలం తిమ్మసముద్రం గ్రామంలో ఉద్యాన సహాయకుడిగా పనిచేస్తున్న వల్లూరి ఇమ్రాన్ పని ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుటుంబ సభ్యులతో పాటు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. వృత్తి పట్ల నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఎలాంటి వ్యసనాలు లేని వ్యక్తి మృతి బాధాకరమని తెలియజేశారు. ఆర్థికపరంగా కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని విన్నవించారు. ఒత్తిడికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాతీయ రహదారి నిర్మాణానికి అటవీ అడ్డంకులు

● కొనసాగుతున్న పనులు
● పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగేదెన్నడో...!


తారు రోడ్డు నిర్మాణానికి రోలరుతో చదును చేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి నిర్మాణ పనులు ఒక వైపు శరవే గంగా జరుగుతున్నా... అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో కొంతమేర ఆలస్యం అవుతున్నాయి. టేకూరుపేట సరిహద్దులో దాదాపు ఏడున్నర కిలోమీటర్ల మేర అనుమతులు లభించాల్సి ఉంది. ఇప్పటికే చాలాసార్లు సంబంధిత అధికారులు అటవీ ప్రాంతలో సర్వే నిర్వహించి నివేదికలు కూడా పంపారు. కానీ పనులు ప్రారంభించి ఏడాది అవుతున్నా అటవీశాఖ నుంచి ఇంకా పూర్తిస్థాయి అనుమతులు లేకపోవడంతో ఆ ప్రాంతలో రోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. అటవీశాఖ నుంచి క్లియరెన్స్ పూర్తయితే అంచనాల మేరకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యే అవకాశాలున్నాయి.

సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ముదిరెడ్డిపల్లె - కడప ప్యాకేజీకి సంబంధించి 167బీ జాతీయ రహదారి నిర్మాణానికి 36 కిమీ పొడవునా పది మీటర్ల వెడల్పుతో రూ.186 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత ఏడాది అక్టోబరు 14న పనులు ప్రారంభించగా సజావుగా సాగుతున్నాయి. అయితే నెల్లూరు-కడప సరిహద్దు వద్ద 7.5 కిమీ, కొండుగారిపల్లె వద్ద 400 మీటర్ల మేర అటవీ శాఖ ఫారెస్టు శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంది. ల్యాండ్ ఎక్విజిషన్‌కు సంబంధించి మల్లేపల్లె వద్ద 500 మీటర్లు, కేశవాపురం వద్ద 400 మీటర్లు, రంగసముద్రం వద్ద 300 మీటర్లు క్లియరెన్సు కావాల్సి ఉంది. ఒక పక్క పనులేమో శరవేగంగా జరుగుతున్నా అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో కొంతమేర జాప్యం జరుగుతోంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సింగరాయకొండ టు మైదుకూరు మీదుగా కడపకు ప్రయాణ సమయం తగ్గే అవకాశాలున్నాయి.

ఇప్పటివకు ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి 76 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా 48 కల్వర్టులు పూర్తయ్యాయి. మరో 24 కల్వర్టులు నిర్మాణంలో ఉన్నాయి. 21 కిలోమీటరు వరకు దాదాపు రోడ్డు పూర్తయింది. మరో 15 కి.మీ. పూర్తి కావాల్సి ఉంది. అటవీశాఖ అనుమతుల కోసం సంబంధిత కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు మేనేజరు మణికంఠను వివరణ కోరగా. పనులు వేగంగా జరుగుతున్నాయని, 2026లోపే పనులు పూర్త య్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరిహద్దుల్లో అటవీశాఖ నుంచి అనుమతులు వస్తే త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

ప్రతి రైతుకు యూరియా అందిస్తాం

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠం మండలం టి.సౌదరివారిపల్లె సచివాలయ పరిధిలోని రైతు సేవాకేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి అక్కడ రైతులకు యూరియా పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా పంపిణీ ఎలా జరుగుతోందని అక్కడున్న వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజనులో విడతల వారీగా రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే యూరియా సరఫరా చేస్తారన్నారు. ఎకరాకు బస్తా చొప్పున పంపిణీ అందజేయలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, ప్రభుత్వం సరఫరా చేసే యూరియాను 50శాతం రైతు సేవాకేంద్రాల ద్వారా, 50శాతం డీలర్ల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, తహశీల్దారు కార్తీక్, డిప్యూటీ తహశీల్దారు జాన్సన్, సాంబశివారెడ్డి, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

యూరియా అక్రమంగా విక్రయిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేసిన యూరియాను అక్రమంగా విక్రయించినా, ఇతర అవసరాలకు మళ్లించినా చర్యలు తప్పవని ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ ఏడీఏ అనిత హెచ్చరించారు. ఏవో వరహరికుమార్‌తో కలిసి శుక్రవారం ప్రొద్దుటూరులో మహాలక్ష్మి ఫర్టిలైజర్స్, కేవీఎస్ఆర్ హోల్‌సేల్ ఎరువుల దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. ఇక్కడి నుంచి దువ్వూరు, చాపాడు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల తదితర రీటైల్ దుకాణాలకు సరఫరా అయిన యూరియా ఇన్వాయిస్‌లను పరిశీలించారు. ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులకు ఇక్కడి వివరాలను పంపి ఆమేరకు రిటైల్ దుకాణాలకు యూరియా చేరిందా? చేరిన సరుకు రైతులకు సక్రమంగా విక్రయించారా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియాను జిల్లాలోపు విక్రయాలు జరపాలని, సరిహద్దులు దాటి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతిని మోసం చేసిన కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

● రూ.1.5 లక్షల జరిమానా


శిక్ష పడిన నిందితుడిని చూపుతున్న పోలీసులు

కడప క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బిమఠం పోలీసుస్టేషన్ పరిధిలో రెండున్నర సంవత్సరాల క్రితం ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. అత్యాచారం చేసి మోసం చేసిన కేసులో సానా రవికుమార్ (24) అనే వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1.5 లక్షల జరిమానా విధిస్తూ కడప సెవెన్త్ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేశ్‌కుమార్ తీర్పునిచ్చారు. కేసు వివరాలా.. బి.మఠం మండలంలోని ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. నెల రోజుల పాటు అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి పెళ్లి చేసుకోమని అడగ్గా నిరాకరించాడు. దీంతో నిందితుడు రవికుమార్ తనను మోసం చేసినట్లు బాధితురాలు 2023 జనవరి 31న బి.మఠం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి కేసు విచారణ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి పై విధంగా తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి


వెంకట శివుడు (ఫైల్)

మైలవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మాధవాపురం గ్రామానికి చెందిన బనగానివెంకటశివుడు (56) అనే వ్యక్తి గురువారం ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి మృతి చెందినట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మిద్దెపై పని ఉండడంతో పైకి ఎక్కగా చుట్టూ కాంపౌండ్ గోడ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యా యి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగ అరెస్ట్.. 52 గ్రాముల బంగారం స్వాధీనం


పట్టుబడ్డ బంగారు నగలు, నిందితుని చూపుతున్న సీఐ, ఎస్ఐ

పుల్లంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కడప చెన్నై జాతీయ రహదారి సమీపంలో దొంగను అరెస్టు చేసి, 52 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. పుల్లారెడ్డిపల్లెకు చెందిన పుట్టబోయిన చరణ్‌కుమార్ అనే దొంగ వద్ద నుంచి బంగారు నెక్లెస్, డాలర్‌తో ఉన్న చైను, బుట్ట కమ్మలు, చిన్న కమ్మలు, చెవి చుట్టలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. పుల్లంపేట ఎస్ఐ శివకుమార్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూకి గురుకుల భవనాలు కేటాయింపు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇకపై ప్రైవేట్ అద్దె భవనాల్లో కాకుండా, తాత్కాలికంగా ప్రభుత్వ భవనాల్లో పనిచేయనుంది. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యాశాఖ ఆదేశాలమేరకు, యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న గురుకులం భవనాలను తాత్కాలికంగా ఆర్కి. టెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయించారు. మొత్తం 8 బ్లాకులు, సుమారు 9360 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన ఈ ప్రభుత్వ భవనాలను దశలవారీగా అందజేయనున్నారు. మొదట 4 బ్లాకులు వెంటనే కేటాయించాలని ఆదేశించారు. మిగిలిన 4 బ్లాకులను వచ్చే నెలలోపు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఈ భవనాల్లో యోగి వేమన యూనివర్సిటీకి చెందిన కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్ విభాగాలు నడుస్తున్నాయి. వీటిని తాత్కాలిక సర్దుబాట్లతో వేరే చోటకు మార్చనున్నారు. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులు ఇకపై అద్దె భవనాల బదులుగా ప్రభుత్వ భవనాల్లో సౌకర్యవంతంగా చదువుకునే అవకాశం పొందుతారు.

మంత్రి నిర్ణయం హర్షనీయం...

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రైవేటు అద్దె భవనాల్లో పడుతున్న ఇబ్బందులను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన మంత్రి యోగివేమన యూనివర్సిటీ పరిధిలో ఉన్న గురుకులం భవనాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వక్ఫ్‌భూమి పునరుద్ధరణ

● అబుహురైరా మసీద్ స్థలం 44సెంట్లు కమిటీకి అప్పగింత


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 24వ డివిజన్‌లో 300 ఏళ్లనాటి అబూహురైరా మసీద్ వక్ఫ్‌భూమి (సర్వేనెంబర్ 267) మొత్తం 1.68 ఎకరాలు ఉండగా, కాలక్రమంలో పెద్ద భవనాల ఆక్రమణకు గురై కేవలం 44సెంట్లు మాత్రమే మిగిలింది. ఆ స్థలం కూడా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ విషయాన్ని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి దృష్టికి కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. వారు స్పందిస్తూ సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. మసీదుకు సంబంధించిన 44సెంట్లు మసీదుకు సంబంధించినదేనని నిర్ధారించి అధికారుల సమక్షంలో కమిటీ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి, మాధవి మాట్లాడుతూ మసీదు భూమిని పరిశుభ్రంగా ఉంచి, పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటాలని మసీదు కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.మన్సూర్ అలీఖాన్, 24వ డివిజన్ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి, షారూక్, అబూహురైరా, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక విజ్ఞాన కళాశాలలో దరఖాస్తులు ఆహ్వానం

సీకేదిన్నె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గుంటూరు లాంఫాంలోని సామాజిక విజ్ఞాన కళాశాలలో నిర్వహిస్తున్న బీఎస్సీ నాలుగేళ్ల కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు సామాజిక శాస్త్రవేత్త ప్రశాంతి తెలిపారు. రాష్ట్రంలో ఏకైక కళాశాలగా గుర్తింపు పొందిన ఈ కళాశాలలో విద్యార్థులకు బోధనతోపాటు శిక్షణ ఇచ్చి వారి ఉన్నతికి బాటలు వేస్తారన్నారు. 2025-26 సంవత్సరానికి కోర్సు మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తు చివరి గడువు ఆగస్టు 31 అని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌జీఆర్ఏయు.ఎసి.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫీజు డీడీ జత చేసి గుంటూరు లాంఫాంలోని వర్శిటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందించాలన్నారు. ఈ కోర్సులో ఆహారం-పోషణ, మానవ అభివృద్ధి - కుటుంబ అధ్యయనం, వనరుల యాజమాన్యం తదితర అంశాల్లో బోధన, తరగతిగదులు నిర్వహించి శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణులుగా తయారు చేస్తారన్నారు. మొత్తం వంద సీట్లు ఉన్నాయని... ఇంటర్ ఎంపీసీ, బైపీసీ చదివినవారు, మూడేళ్ల హోంసైన్స్ చదివినవారు, అగ్రికల్చరల్, హార్టికల్చరల్, వెటర్నరీ, డిప్లమాలో ఉత్తీర్ణులు అర్హులన్నారు. ఎంసెట్, నీట్‌తో ఎటువంటి సంబంధం లేదని, నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కోర్సు చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు.

వైవీయూలో 'హెల్ప్‌లైన్' ఏర్పాటు


హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలిస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూతో పాటు జిల్లాలోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందే విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎండీసీ) సైట్‌లోకి వెళ్లి ప్రతి విద్యార్థి డిగ్రీలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని.. వారి సౌకర్యార్థం ఉచితంగా సహాయ కేంద్రం పనిచేస్తుందన్నారు. వైవీయూ క్యాంపస్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు, నాలుగేళ్ల హానర్స్ కోర్సులు బీకాం కంప్యూ టర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, అలాగే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులైన బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, అప్లైడ్ జియాలజీ కోర్సులలో ప్రవేశానికి ఇక్కడే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని చెప్పారు. సందేహాలకు 9441032737 నెంబర్‌ను సంప్ర దించాలని కోరారు.

అభివృద్ధి పనుల నివేదికను సీఎంకు అందజేస్తాం

● టీటీడీ నిపుణుల కమిటీ సభ్యుడు రాము


కోదండరామాలయంలో పరిశీలిస్తున్న నిపుణుల కమిటీ సభ్యులు

ఒంటిమిట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో చేపట్టాల్సిన పనుల నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేస్తామని టీటీడీ నిపుణుల కమిటీ సభ్యుడు రాముడు తెలిపారు. శుక్రవారం ఆయన ఒంటి మిట్టకు విచ్చేశారు. కోదండరామాలయం కల్యాణవేదిక తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఒంటిమిట్టలో చేప ట్టాల్సిన పనులు, భవనాలు భక్తుల వసతులు, ఆలయ అభివృద్ధికి చేయాల్సిన పనులను పరిశీలించామని.. ఈ విష యాలను టీటీడీ బోర్డుకు తెలియజేస్తామన్నారు. తదనం తరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పూర్తి నివేదిక అందజేస్తామన్నారు. అంతకుముందుగా కోదండరా మాలయం, కల్యాణవేదిక పరిసర ప్రంతాల్లో కలియదిరిగి ఎక్కడ ఎలాంటి వసతులు కల్పించాలి, చెరువు సుందరీకరణ, అన్నదాన భవనం అంశాలపై ఆలయ అధికారులు అర్చకులతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేశామని.. అందులో భాగంగానే ఒంటిమిట్టను సందర్శించామన్నారు. కార్యక్రమంలో ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ గుర్తింపుపై శిక్షణ

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతకరమైన క్యాన్సర్‌ను ముందస్తుగా లక్షణాలను బట్టి గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు వైద్యాధికారులకు శిక్షణ నిర్వహించారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్‌సీడీ 4.0 - 2 శిక్షణ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి ప్రజల ప్రాణాలను కాపాడటమే శిక్షణ ఉద్దేశ్యమన్నారు. రెఫరల్ సిస్టం ద్వారా అనుమానిత కేసులను తక్షణం పై ఆస్పత్రులకు పంపించడం, ఎన్‌సీడీ పోర్టల్‌లో వివరాల నమోదు చేసి ఫాలోఫ్ చేసే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆర్ఎంవో గోపాల్‌దాస్, డాక్టర్లు చిరంజీవిరెడ్డి, మల్లేష్, ఆరీఫ్, మంజుల, అనూష, కవిత తదితరులు పాల్గొన్నారు.

కేసు పెట్టిస్తావా అంటూ... తల్లి, చెల్లిపై కొడుకు దాడి

ప్రొద్దుటూరు , ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం బంగారు అంగళ్ల వీధిలో నివాసంవుండే వేంపల్లె మూగన్నగారి వనిత, కుతూరు డాక్టర్ లక్ష్మీసామినిరెడ్డిపై ఆమె కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి తన స్నేహితులతో కలిసి దాడి చేసి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తనకు ఇష్టం లేకున్నా చెల్లెలు లక్ష్మీసామినికి వేరే వ్యక్తితో పెళ్లి జరిపించిందని కోపంతో ఈ దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. మోడంపల్లె బైపాస్ రోడ్డులో వనిత కొత్త ఇల్లు కడుతున్నారు. ఆ ఇంటి వద్దకు ఆమె కారు తీసుకొని వెళ్లగా అక్కడికి ఆమె కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, భార్గవ, సందీప్‌లతో పాటు మరి కొంతమంది కలిసి కారుపై రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. వనితను చంపుతామని బెదిరించారు. ఈ సంఘటనపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో వనిత, చెల్లి లక్ష్మీసామిని కలిసి కేసు పెట్టారు. ఈ కేసు పెట్టారని కోపంతో తిరిగి శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న తల్లి వనిత, చెల్లెలు లక్ష్మీసామినితో పాటు మరో వ్యక్తిపై హర్ష అతని స్నేహితులు కలిసి కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు హర్షవర్ధన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సందీప్‌రెడ్డి అనే ముగ్గురుని అరెస్టు చేసి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఒన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

విద్యార్థి మృతిపై అనుమానాలున్నాయి...

దర్యాప్తు చేసి.. నిజాలు వెల్లడించాలి ● విద్యార్థి బంధువులు


విద్యార్థి నరసింహనాయుడు మృతదేహం వద్ద విలపిస్తున్న బాబాయ్ ఉమామహేశ్వరరావు, బంధువులు

వేంపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గురువారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.నరసింహనాయుడు (18) అనే విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే విద్యార్థి మృతిపై మృతుడి బాబాయ్ ఉమామహేశ్వర్‌రావు, బంధువులు అనుమానాలు ఉన్నాయని... సక్రమంగా దర్యాప్తు చేసి నిజాలు వెల్లడించాలని పోలీసులకు, ట్రిపుల్‌ఐటీ అధికారులను కోరారు. శుక్రవారం శ్రీకాకుళం నుంచి ఉమామహేశ్వర్‌రావు, ఇతర బంధువులు వేంపల్లెకు చేరుకున్నారు. మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఏఓలను కలిశారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్య చేసుకునేంత సమస్యలు లేవు, విచారణ చేయించి నిజాలు బయటపెట్టాలని కోరారు. అలాగే పోలీసులను కలిసి దర్యాప్తు త్వరగా చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా డీఎస్పీ మురళీనాయక్ మృతదేహాన్ని పరిశీలించి బంధువులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులను విచారించారు. వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా వారు శ్రీకాకుళంకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

చిరంజీవి సేవా కార్యక్రమాలు ఎందరికో ఆదర్శం



కేక్ కట్ చేస్తున్న తుంగా రమణయ్య తదితరులు

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు చిరంజీవి నిర్వహిస్తున్న పలు రకాలైన సేవా కార్యక్రమాలు ఎంతోమందికి ఆదర్శమని జనసేన నాయకుడు తుంగారమణయ్య తెలిపారు. చిరంజీవి 70వ జన్మదినాన్ని పురస్కరించుకొని విశ్వప్రగతి చిట్‌ఫండ్ కార్యాలయంలో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరంజీవి చేసిన పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అందులో అత్యంత ప్రాధాన్యత చోటు చేసుకున్నాయన్నారు. చిరంజీవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజల హృదయాల్లో జీవించాలని భగవతుని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఉద్యోగులకు ఉన్న అన్ని రకాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించే విధంగా ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణమరాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కడప నగరం ఎన్‌టీఏ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బన్న, జిల్లా గౌరవాధ్యక్షులు కురాకు రవీంద్ర, రాష్ట్ర నాయకులు అబ్దుల్ గఫూర్, ఆదిల్ బాష, నారాయణరెడ్డి పలు సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ చలపతిరాజు, బీసీ సుబ్బరాయుడు, లక్ష్మీనారాయణ, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అని జిల్లాన్యాయ సేవాధికారసంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. స్థానిక అంధుల పాఠశాలలో దివ్యాంగులకు ప్రత్యేక పిల్లలకు శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు డైరెక్టరు వెల్ఫేర్ అండ్ డిఫరెంటబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ క్రిష్ణకిశోర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, అధికారులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల బారిన పడవద్దు

చెన్నూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాల బారిన పడవద్దని సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. స్థానిక పాతబస్టాండులో శుక్రవారం రాత్రి సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే దిశగా నాటికలతో అవగాహన నిర్వహించారు. అనంతరం ప్రదర్శించిన ముఠాకక్షల నాటిక, జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలను అనుసరించి ఎరువులను వాడుకోవాలి



సూచనలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భూసారపరీక్షలను అనుసరించి ఎరువులను వాడుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అనిమెల గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వారి సహకారంతో ఏవో శ్యామ్‌బాబుతో కలిసి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.కాగా పశుపెంపకందారులు, పాడిరైతులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, పశువైద్యశిబబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక మూల్యాంకన విధానాన్ని ఉపసంహరించుకోవాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బుక్‌లెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్యామ్‌సుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఏడీ అనిల్‌కుమార్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాష, జిల్లా కార్యదర్శులు గురయ్య, శ్రీనివాసులు, నరసింహులు, రామచంద్రారెడ్డి, జిల్లా కౌన్సెలర్లు మస్తాన్‌బాబు, సుబ్బారెడ్డి, సలామ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

పెండ్లిమర్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సీఐ చల్లనిదొర తెలిపారు.కడప-పులివెందుల ప్రధాన రహదారిపై శుక్రవారం వెల్లటూరు గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు.సరైన పత్రాలు లేని 13 వాహనాలకు రూ.13455లు జరిమానా విధించారు.అనంతరం వాహనదారులకు చట్టాలను వివరించారు.

సెంట్రలైజ్‌డ్ కిచెన్‌తో విద్యార్థులకు పౌష్టికాహారం





సెంట్రల్ కిచెన్‌లో ఏర్పాటు చేసిన బాయిలర్స్, సీకేదిన్నెలో సిద్ధంగా ఉన్న సెంట్రల్ కిచెన్

సీకేదిన్నె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం సెంట్రలైజ్‌డ్ కిచెన్ ఏర్పాటును ప్రారంభిస్తోంది. దీని ద్వారా విద్యార్థులకు మండలంలో ఒక చోట భోజనం, ఆహార పదార్థాలు వండి అన్ని స్కూళ్లకు అందించడం జరుగుతుంది. పాత పద్ధతిలో కాకుండా స్టీమ్ ద్వారా భోజనం శుచి, శుభ్రతతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు విద్యార్థులకు ఇది ఎంతో చక్కగా ఉపయోగపడుతుంది.

● చింతకొమ్మదిన్నె మండలంలో రెండు కిచెన్లు..: చింతకొమ్మదిన్నె మండలంలో రెండు సెంట్రలైజ్‌డ్ కిచెన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీని ద్వారా మండలంలో అన్ని పాఠశాలలకు ఆహారాన్ని సకాలంలో అందించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె, పవర్‌గ్రిడ్ వద్ద జె.కొత్తపల్లె పాఠశాలలో సెంటర్ కిచెన్లు ఏర్పాటు చేయడం జరిగింది. చిన్న చిన్న పనులు మినహా దాదాపు అన్ని పూర్తయ్యాయి. ఒక్కో కిచెన్ సెంటర్ నుంచి మూడు రూట్లలో మూడు వాహనాల ద్వారా భోజనం విద్యార్థులకు వేడివేడిగా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా కూడా ఇదే కార్యక్రమం చేపట్టేందుకు కలెక్టర్ ప్రణాళికలు రచించి 90 రోజుల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది.

● ఇస్కాన్ విధానంలో ఆహారం..: ఇస్కాన్ విధానంలో సెంట్రల్ కిచెన్‌లో భోజనం, కూరలు తయారు చేసి హాట్‌బాక్సుల ద్వారా పాఠశాలలకు చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆహారపదార్థాలు కూడా మినరల్ వాటర్‌తో చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సెంట్రల్ కిచెన్‌లో కోడిగుడ్లు కూడా ఉడికించి విద్యార్థులకు అందించడం జరుగుతుంది. రాగి గంజి కూడా విద్యార్థులకు మూడు రోజులపాటు అందించేందుకు ఏర్పాట్లు యథావిధిగా చేస్తున్నారు.

● త్వరలో ప్రారంభం - రమాదేవి, ఎంఈవో

చింతకొమ్మదిన్నె మండలంలో రెండు సెంట్రలైజ్‌డ్ కిచెన్లను త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నాం. త్వరలో వాహనాల ద్వారా అన్ని పాఠశాలలకు అందిస్తాం.

ప్రతి ఒక్కరూ 1098ను గుర్తుంచుకోవాలి



కడప.. విద్యార్థులకు చట్టాలపై వివరిస్తున్న శక్తిటీం

పులివెందుల రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హక్కులు కోల్పోతున్న బాలబాలికలకు అండగా ఉండేందుకు దోహదపడే 1098 నెంబర్‌ను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్నీ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్‌లో బాలల హక్కులు, చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలుపాల్గొన్నారు.

కడప క్రైం..: నగరంలో శక్తిటీం బృందాలు పాఠశాలల్లో విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. శుక్రవారం ఎర్రముక్క పల్లెలోని చౌడేశ్వరి స్కూలు, తారకరామనగర్‌లోని మధుసూదనరెడ్డి స్కూలులో శక్తిటీం మహిళా ఎస్ఐ శాంతమ్మ సైబర్ మోసాలపై డయల్ 100, 112, చైల్డ్‌లైన్ 1098,గృహహింస 181, మహిళా వేధింపులు 1091, సైబ ర్ టోల్‌ఫ్రీ 1930, సైబర్‌మిత్ర తదితరాలపై వివరించారు.

చెన్నూరు..: ప్రజలు తమ ప్రాంతాల పరిధిలో బాల్యవివాహాలు జరుగుతున్నా, బడి ఈడు పిల్లలు బడికి పోకుండా భిక్షాటన చేస్తున్నా చైల్డ్‌లైన్ ప్రొటెక్షన్ నెంబరు1098కు సమాచారం ఇవ్వాలని సీడీపీవో శాంతమ్మ అన్నారు. మండలంలోని కొండపేటలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక కొండపేటతో పాటు చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన నిర్వహించారు. సూపర్‌వైజర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం..: చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత పేర్కొన్నారు. శక్రవారం సింహాద్రిపురంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హెల్ప్‌లైన్ 1098పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వసంత, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె..: బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల, పాములూరు జడ్పీ హైస్కూల్లో చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 నెంబర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర మ్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగాల..: లింగాల ఉన్నత పాఠశాలలో 1098 హెల్ప్‌లైన్ నెంబర్‌పై శుక్రవారం అంగన్వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అవగాహన కల్పించారు.మహిళా పోలీస్ ,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల..: పిల్లలు ఆపద సమయాల్లో ఉన్నప్పుడు 1098 నెంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణసాయం అందుతుందని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపల్లె హైస్కూల్, వేముల హైస్కూల్‌ల్లో 1098 ఫోన్ నెంబర్‌పై అవగాహన కల్పించారు.

అక్టోబరు 2 నాటికి లబ్ధిదారులకు టిడ్కో గృహాలు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2వ తేదీ నాటికి టిడ్కో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కడప ఆర్డీఓ కార్యాలయం సమావేశ మందిరంలో కడప నియోజక వర్గ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్, ఎమ్మెల్యే మాధవి, కమిషనరు మనోజ్‌రెడ్డి, ఆర్డీవో జాన్‌ఇర్విన్ హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాంజనేయపురం టిడ్కో గృహాల సముదాయాలు, చలమారెడ్డిపల్లి హౌసింగ్ కాలనీల్లో మౌలిక సదుపాయాలను అక్టోబరు 2 నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, డివిజన్ ,నియోజక వర్గ స్థాయి,మండల అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'కమనీయ కవితలు' పుస్తకావిష్కరణ



కడప మారుతీనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి లావణ్య రాసిన కమనీయ కవితలు, కవితా సంపుటిని శుక్రవారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లి కార్జునరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో తన ముందు కదలాడిన అపురూప దృశ్యాలను, ఆనందమయ సన్నివేశాలను, అస్తవ్యస్త సంఘటనలను లావణ్య అద్భుత రీతిలో చిత్రీకరించారన్నారు. అనంతరం పలువురు ప్రముఖులు లావణ్యను సత్కరించారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు జీవీ సాయిప్రసాద్, షేక్ మహ్మద్‌ఇస్మాయిల్ , ప్రముఖ వైద్యుడు పుత్తా బాలిరెడ్డి, రచయితల సంఘం ప్రధానకార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, ఇంటాక్ కేంద్ర పాలకమండలి సభ్యుడు చిన్నపరెడ్డి,వెంకటయ్య పాల్గొన్నారు.

'నగరంలో ఏ ఇంటికెళ్లినా సమస్యలే'

కడప కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇంటింటా సమస్యలపరిష్కారం కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికెళ్లినా ప్రభుత్వ సంక్షేమ పథకాల కోతలు వినిపిస్తున్నాయని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్‌పీర్ విమర్శించారు శుక్రవారం ఇంటింటా కాంగ్రెస్- ప్రజల సమస్యల పరిష్కారానికై కాంగ్రెస్ అనే కార్యక్రమం గౌస్ నగర్ 27 వ డివిజన్‌లో కాంగ్రెస్ నేతలు నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి సయ్యద్ షామీర్ హుస్సేన్, నేతలు పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీలో కమిషనర్ పర్యటన



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి శుక్రవారం ఉదయం రామాంజనేయపురం జర్నలిస్టు కాలనీలో పర్యటించారు. వరద కాలనీ కూడలి వద్ద రోడ్డు అధ్వానంగా ఉండటం పరిశీలించారు. జర్నలిస్టు కాలనీ, ఆచార్ల కాలనీ, వరదకాలనీలలో పలు వీధులన్నీ అర్ధగంటకు పైగా తిరిగి పలు సమస్యలను గుర్తించారు. జర్నలిస్టు కాలనీలో మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈఈని ఆదేశించారు. కమిషనర్ వెంట ఏపీయూడబ్ల్యూజే రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, స్థానిక కార్పొరేటర్, వార్డు సెక్రటరీ తదితరులు ఉన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

పులివెందుల రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని లేఅవుట్ ఓనర్లు, డెవలపర్లు, ఎల్టీపీలకు ఎల్‌ఆర్‌ఎస్‌పై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ జూన్ 30, 2025 నాటికి కనీసం ఒక్క ప్లాట్ అయిన అనధికార లేఅవుట్‌లో రిజిస్టర్ అయితే ఆ లేఅవుట్ క్రమబద్ధీకరణకు అర్హత అవుతుందన్నారు. కార్యక్రమంలో టీపీఓ అజయ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలి

సీకేదిన్నె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ ఎం.నాగభూషణం తెలిపారు. సీకేదిన్నె పోలీసు స్టేషన్‌లో శుక్రవారం శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి, ట్రైనీ ఎస్ఐ ప్రణయ్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై తనిఖీలు

కడప క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా సబ్ డివిజన్ల డీఎస్పీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి తాగే, విక్రయించే అవకాశమున్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నారు. కిరాణాషాపులు, గోడౌన్‌లు, పాడుబడ్డ భవనాల్లో జల్లెడ పడుతున్నారు. ఎక్కడైనా గంజాయి రవాణా, వినియోగం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మసీదు స్థలంపై కన్ను

కొత్త మసీదు నిర్మాణం పేరుతో కాజేసే యత్నం



పెండ్లిమర్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగలైనా తాము దొంగిలించిన సొమ్ములో కొంత సొమ్ము దేవునికి సమర్పిస్తామని మొక్కుకుంటారు.అలాగే కొంత మంది భూకబ్జా రాయుళ్లు తన భూమికి పక్కన ఉన్న ప్రభుత్వ,దేవుని మాన్యాలు, ఈనాం,వక్ఫ్ భూములు,వాగులు,వంకలు,కుంటలు,చెరువులు కాజేసి వెంచర్లు వేయడం మనం నిత్యం చూస్తున్నాం.ఐతే ఏకంగా ఈ కలికాలంలో గుడిని గుడిలోని లింగాన్నే మింగేసే వారిని చూస్తున్నాం.అలాంటి కోవకే చెందింది ఈ కథనం.వివరాల్లోకి వెళితే పెండ్లిమర్రి మండలంలోని నందిమండలం గ్రామంలో వంద సంవత్సరాల చరిత్ర ఉన్న మసీద్-ఏ-అక్సా(మసీదు)స్థలంపై అదే గ్రామానికి చెందిన వైసీపీ మైనార్టీనేత కన్ను పడింది. పడిందే తడవుగాకొంత మంది నేతలతో మాట్లాడుకుని కొత్త మసీదు నిర్మాణం పేరుతో పాత మసీదును కూలగొట్టేందుకు పన్నాగం పన్నుతున్నాడు. 6 సెంట్ల విస్తీర్ణంలో ఈ మసీదు గ్రామ నడి బొడ్డున ఉంది.ఈ మసీదుకు 12 ఎకరాల 50 సెంట్ల భూమి ఉంది.ఇది వక్ఫ్ పరిధిలో ఉండటం వల్ల ఈ మసీదుకు ముత్తవల్లి,ఇమామ్,మౌజన్‌లు అధికారికంగా ఉన్నారు. ఇంత ఘన చరిత్ర ఉన్న ఈ మసీదుపై పక్కనే రెండు అంతస్తుల మేడ కట్టుకున్న మైనార్టీ నేత కన్ను పడింది.తన ఇంటికి పక్కన ఉన్న మసీదు వాస్తు పరంగా ఉండటం మంచిది కాదని కొందరు చెప్పడంతో ఎలాగైనా మసీదును పడగొట్టాలని కొత్త మసీదును నిర్మించాలనే ఎత్తుగడతో కూల్చేందుకు సిద్ధమయ్యాడు.ఆర్థికంగా బలవంతుడు కావడంతో కొంత మంది అండతో వేగంగా పావులు కదుపుతున్నాడు.ఈ గ్రామంలో రెండు వేలకు పైగా మైనార్టీలు ఉన్నారు.మసీదును కూలిస్తే మా మనోభావాలు దెబ్బతింటాయని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే మసీదుకు చెందిన ఇమామ్,మౌజన్‌లు కొంత మంది మైనార్టీలతో కలసి కడప నగరంలోని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. అధికారులు స్పందించి మైనార్టీ మనోభావాలు దెబ్బ తినకుండా,మసీదు కూల్చకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు మట్టి విగ్రహాల వితరణ

కడప కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రానున్న వినాయకచవితి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 23న శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి నగర రామక్రిష్ణానగర్‌లో ఉన్న శనీశ్వర స్వామి ఆలయం లో మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహాలన వితరణ చేస్తున్నట్లు ఆ సమాఖ్య గౌరవాధ్యక్షుడు చంద్రమౌళీశర్మ, అధ్యక్షుడు సత్యనారాయణశర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌శర్మ తెలిపారు. భక్తులు స్వామివారి విగ్రహ ప్రతిమలను తీసుకెళ్లి వినాయక చవితి వేడుకలను కుటుంబంతో సంతోషకర వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.

నేడు శనీశ్వరస్వామికి తైలాభిషేకం..: శని అమావాస్య సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నగర రామక్రిష్ణనగర్ లో ఉన్న శనీశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 5గంటల నుంచి స్వామివారికి తైలాభి షేకం జరగనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ సహ ప్రముఖ్ వారణాసి శ్రీధర్‌శర్మ తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

కడప కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విశ్వబంధుత్వ దినోత్సవ సందర్భంగా ఆంధ్ర - కర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌చార్జ్, సీనియర్ రాజయోగిని బీకే గీతాదీదీ ఆధ్వర్యంలో నగర ఓం శాంతినగర్ సేవా కేంద్రం ఓం నివాస్ భవనంలో ఈ నెల 24, 25 తేదీల్లో (ఆది, సోమవారాల్లో) ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రత్యేక రక్తదాన శిబిరం కార్యక్రమం జరగను న్నట్లు బ్రహ్మకుమారీలు తెలిపారు. ఇందులో రక్తదానం చేసిన వారికి ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ ఇస్తామ న్నారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చక్రాయపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట ఐటీఐ కళాశాలలో మూడో విడత సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణత పొందిన వారు ఈనెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కౌన్సెలింగ్ ఈనెల 29వ తేదీన ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు. వివరాలకు ఐటీఐ కళాశాలను సంప్రదించాలని కోరారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

కమలాపురం రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో వినాయకచవితి సందర్భంగా వినాయక మండపాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం వారు స్టేషనులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కమలాపురం పోలీసు స్టేషను పరిధిలోని గ్రామాల్లో నిర్వహించనున్న విగ్రహాలు ఏర్పాటుకు పోలీసు, విద్యుత్‌శాఖ అనుమతులు తప్పక ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

వల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల పట్ల బాలికలు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో శ్రీలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వల్లూరు జిల్లాపరిషత్ హైస్కూలులో చైల్డ్‌లైన్‌పై అవేర్‌నెస్ నిర్వహించారు. అనంతరం ఉమెన్ ట్రాఫిక్,గుడ్ టచ్ అండ్ బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాధమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

విలువలు పెంపొందించాలి

కడప కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మానవతా విలువలు పెంపొందించుకోవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందని మానవతా సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి సూచించారు. మానవతా సేవాసంస్థ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా శుక్రవారం కడపలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు చేసి 22 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కడపలోర్యాలీ నిర్వహించామన్నారు. ఆ సంస్థ ప్రతినిధులు సుబ్బ రాయుడు, గోపీ, రామచంద్రారెడ్డి, క్రిష్ణసింగ్‌రాయుడు, సెల్వం పాల్గొన్నారు.

స.హ.చపై అవగాహన ర్యాలీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సహకారశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించినట్లు జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య అన్నారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడంలో భాగంగా సహకార ఉద్యోగులు శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక డివిజనల్ కో ఆపరేటివ్ కార్యాలయం నుంచి మొదలైన ఈ ర్యాలీ జిల్లాసహకార కేంద్రం బ్యాంకు వరకు సాగింది. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సీఈవో రాజా మణి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజరు ఖాదర్‌వల్లి, సహకారశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకలకు గణనాథులు సిద్ధం




తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు, ముస్తాబైన గణనాథులు



ప్రత్యేక ఆకృతిలో రూపొందిన వినాయకుడు

జమ్మలమడుగు/ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సమీపిస్తుండడంతో వేడుకలకు గణనాథులు సిద్ధమవుతున్నారు. ఈనెల 27వ తేదీ వినాయక చవితి పర్వదినం పురష్కరించుకుని వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద విగ్రహాల అమ్మకాలకు నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాల కమిటీవారు వచ్చి చాలా వరకు విగ్రహాలను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో రంగురంగుల వినాయక విగ్రహాలు ప్రత్యేక అలంకరణగా నిలిచాయి. అలాగే ప్రత్యేక ఆకర్షణగా ఓ వినాయక విగ్రహాన్ని విద్యుత్ పరికరాలతో కళ్లు మూయడం, తెరువడం లాంటి ప్రత్యేక ఆకర్షణగా నిర్వాహకులు తయారు చేశారు. గణేష్ చతుర్థి సందర్భంగా లక్షల సంఖ్యలో విగ్రహాలను ప్రజలు ప్రతిష్ఠించి పూజలు చేయడం ఆనవాయితాగా వస్తోంది. గతంలో కొన్ని కొన్ని గల్లీలలోనే విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేసేవారు. క్రమేణ ఏడాదికేడాది గల్లీకి మూడు నుంచి నాలుగైదు విగ్రహాలను ప్రతిష్ఠించి వైభవంగా వేడుకలు చేస్తున్నారు. ఇందుకు యువత ముందుకు రావడంతో గణేష్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

ముప్పుగా పరిణమిస్తున్న పీవోపీ విగ్రహాలు

ఈ విగ్రహాలు ప్రధానంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పీవోపీ)తో తయారవుతున్నాయి. ముప్పుగా పరిణమిస్తున్న ఈ పీవోపీ విగ్రహాల నిర్మాణం తక్కువ ఖర్చుతోపాటు ఆకర్షణీయంగా ఉండడం వలన ప్రజల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. పీవోపీ విగ్రహాలు పర్యావరణానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నా వాటి నివారణపై ప్రచారం సరిగా లేనందున ప్రజలు వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. పీవోపీ విగ్రహాల్లో వాడే రంగుల్లో పాదరసం, సీసం, క్రోమియో వంటి విషపూరిత లోహాలు కలిగి ఉంటుందని దాని ప్రభావంతో విగ్రహాల నిమజ్జనం సమయంలో చెరువులు, నదులను కాలుష్యం చేస్తుందని అందువల్ల మట్టివినాయకులనే వాడాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

నీటి కలుషితంతో జీవరాశులకు నష్టం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీష్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా ఆ నీరు కలుషితం అవుతుంది. ఆ నీటిని ఉపయోగించి రైతులు పొలాల్లో పంటలను వాడడం ద్వారా పంట నాశనం అవడంతోపాటు రసాయనాల పంట ప్రజలకు చేరిఅనారోగ్యం పాలవుతున్నారు. అనేక రోగాలకు కారణం అవుతున్న పీవోపీ విగ్రహాలను కాకుండా సహజసిద్ధమైన రంగులతో తయారు చేసిన మట్టి విగ్రహాలను వాడుదాం, నీటిని కాలుషితం కాకుండా కాపాడుకుందాం.

- డాక్టర్ తవ్వా సురేష్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి

మట్టి విగ్రహాలను పూజించడం మేలు



పట్టణ ప్రజలు పీవోపీ విగ్రహాలను కాకుండా మట్టితో చేసిన విగ్రహాలతోనే రాబోవు వినాయక చవితి పండుగను జరుపుకోవాలన్నారు. పీవోపీ విగ్రహాలతో ఆర్టిఫిషియల్ రంగులతో పర్యావరణానికి హాని కలిగించవద్దని హితవు పలికారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కావాలని, ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించకుండా పట్ట, నార సంచులను ఉపయోగించాలన్నారు. చేయి చేయి కలుపుదాం, ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరును నిర్మిద్దామని తెలిపారు.

- రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

కాలుష్య నివారణకు మట్టి గణపతిని ప్రతిష్ఠించండి

జమ్మలమడుగు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు నాంది పలకాలని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి సూచించారు. శుక్రవారం జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయ చాంబర్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మట్టి గణపతిని ప్రతిష్ఠించాలన్నారు. ఆర్డీవో సాయిశ్రీ , డీఎస్పీలు వెంకటేశ్వరరావు ఇచ్చిన సూచనల మేరకు వినాయక విగ్రహాల ఆర్గనైజేషన్ కమిటీ వారు నిబంధనలు పాటించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగించరాదని, నీటి కాలుష్యం ఎక్కువ అవుతుందని తద్వారా భూగర్భజలాలు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు సుబహాన్, సుదర్శన్, ప్రసాద్, కార్యాలయ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ



బద్వేలు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :పట్టణం లోని కనకదుర్గమ్మ ఆల యంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా కనక దుర్గమ్మ అమ్మవారు తమలపాకులతో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అమ్మ వారిశాల వీధిలో వాసవీకన్య కాపరమేశ్వరి అమ్మవారికి వేకువజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహిం చారు. అనంతరం ఉభయదాతలచే క్షీరా భిషేకం నిర్వహించి బంగారు నగలతో ప్రత్యేక అలంకారం నిర్వహించారు. ఆల యకమిటీవారు భక్తుల కు తీర్థప్రసాదాలు అందజేశారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాత మార్కెట్‌లోని లితాదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం మహిళలు అమ్మవారికి సామూహిక లలిత సహస్ర నామార్చన చేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

దోబీఘాట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

దువ్వూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో దోబీఘాట్ల నిర్మాణానికి రూ.1.30 కోట్లతో బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. 13 ప్రాంతాల్లో ఒక్కో చోట నిర్మాణం చేపట్టేందుకు రూ.10 లక్షలతో వాటి ప్రతిపాదనలు చేసినట్లు పేర్కొన్నారు. మరో చోట దోబీఘాట్ మరమ్మతుల కొరకు రూ.3 లక్షలతో ప్రతిపాదనలు చేశామని వివరించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా : సర్పంచ్



విగ్రహం వద్ద ప్రహరీని పరిశీలిస్తున్న సర్పంచ్ సుధాకర్

పోరుమామిళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రామాయపల్లె గ్రామస్థులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు. రామాయపల్లెకు వెళ్లే రహ దారి పక్కన అంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసిన ప్రహరీ నిర్మాణంలో వైసీపీ హయాంలో ఆటంకాలు రావడంతో అప్పట్లో అధికారులు లేని పోని ఆంక్షలు విధించారు. ఇటీవల అక్కడ అంద రితో మాట్లాడి అంజనేయస్వామి విగ్రహం చుట్టూ ప్రహరీ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద చుట్టు ప్రహరీ నిర్మాణాలను సర్పంచ్ పర్యవేక్షించారు. వీలైనంత త్వరగా ఆ పనులను పూర్తి చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

పోరుమామిళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మేజరు పంచాయతీలోని 18వ వార్డు అయిన దమ్మనపల్లె సమీపం ప్రాంతంలో సర్పంచ్ యనమలస సుధాకర్ శుక్రవారం వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. ఆ వార్డులో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారనే విషయం మేజరు పంచయాతీ సర్పంచ్ యనమల సుధాకర్ దృష్టికి తీసుకెళ్ళంతో ఆయన దాదాపు 30 వీధిలైట్లను ఏర్పాటు చేయించారు.

ఐటీఐలో మూడో స్పెల్ అడ్మిషన్లు ప్రారంభం

ఎర్రగుంట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఐటీఐలో 3వ స్పెల్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ టి.నవరూప్‌కుమార్ తెలిపారు. ఈనెల 26వ తేదీలోపు ఎర్రగుంట్ల ఐటీఐలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస ుకోవచ్చన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానికల్ డీజల్, కంప్యూటర్ ఆపరేటింగ్ ప్రోగ్రాం అసిస్టెంట్ ట్రేడ్లలో ఖాళీలున్న ట్లు తెలిపారు. వివరాలకు ఎర్రగుంట్ల ఐటీఐలో అధికారులను సంప్రదించాలన్నారు.

గర్భిణుల్లో రక్తహీనతను నివారించాలి

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గర్భవతులలో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని డీపీఎంవో డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చౌడూరు, కామనూరులలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం పర్యటించి ఆయా సచివాలయాల్లో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లకు సమావేశం నిర్వహించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, డీపీఎంయూ నారాయణ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అవధూత రాములమ్మ ఆరాధనోత్సవాలు

కాశినాయన ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సావిశెట్టిపల్లెలో అవధూత వారణాసి రాములమ్మ 85వ ఆరాధనోత్సవాలు శుక్రవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. రాములమ్మ దివ్య సమాధివద్ద భక్తులు ప్రత్యేక పూజలు భజనలు నిర్వహించారు. అనంతరం నిర్వాహ కులు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

లాభాల బాటలో ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్

● సర్వసభ్య సమావేశంలో చైర్మన్ వెల్లడి



మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు చైర్మన్ సుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు ,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకును సమష్టి కృషితో లాభాల బాటలో నడుపుతున్నామని టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టౌన్ బ్యాంకులో సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2024- 25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1.35 కోట్ల మేర ఆదాయం బ్యాంకు లావాదేవీల ద్వారా సమకూరిందన్నారు. ఇందులో 10 శాతం మేర షేర్ హోల్డర్లకు డివిడెండ్ అందజేయనున్నామన్నారు. జిల్లాలో ఎర్ర గుంట్ల, కడప, బద్వేలు బ్రాంచ్‌లకు విస్తరించి సేవలు అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పథంలోకి బ్యాంకును తీసుకెళతామన్నారు. సమావేశంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు మహ్మద్ గౌస్, డైరెక్టర్లు వెల్లాల కుమార్‌రెడ్డి, నందం సీతారామయ్య, కొత్తపల్లె కిశోర్, పబ్బతి సురేష్, వేంపల్లె రాంభూపాల్ రెడ్డి గోధిన గంగాధర్, సురేంద్రనాధ్ రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, ఖలీల్‌బాషా ,ఓబులరెడ్డి, నాగేంద్ర కుమార్ సూర్యనారాయణరెడ్డి బ్యాంకు సిఈవో నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధిలో రూ.64వేలు రికవరీకి ఆదేశం

జమ్మలమడుగు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఉపాధి హామీ పథకంలో జరిగిన పను ల్లో రూ.64,200 రికవరీకి జిల్లా అధికారులు ఆదేశించారు. శుక్రవారం జమ్మలమడుగు ఉపాధి హామీ కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం జరిగింది. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమై రాత్రి 8.30 గంటల వరకు కొనసాగిందని ఏపీ ఎం పద్మారాణి తెలిపారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో జమ్మలమడుగు మండలానికి సంబంధించి 14 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన పనులపై 20వ విడత సామాజిక తనిఖీ నిర్వహిం చారు. అయితే గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పలు చోట్ల అక్రమాలు చోటు చేసుకున్నట్లు సమావేశం దృష్టికి వచ్చింది. 545 పనులకు గాను రూ.8.92 కోట్లు పనులు జరిగినట్లు అందులో విచారించగా రూ.64,200 రికవరీకి జిల్లా అధికారులు సమావేశంలో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయభాస్కర్, శివలింగారెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, నాగార్జున, ఇన్‌చార్జి ఎంపీడీవో శివారెడ్డి, 14 గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బద్వేలు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడు అంటువ్యాధులు ప్రబలవని డిప్యూటీహెల్త్ ఎడ్యుకేటరు వెంగయ్య, హెల్త్ అసిస్టెంటు జనార్ధనరావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని కోటవీధి, మండల పరిధిలో ఎత్తిరాజుపల్లె గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిలో ఉపయోగించే రిఫ్రిజిరేటరు, కూలర్లు, ఇంటి ఆవరణలో కొబ్బరిబోండాలు, పాత రోళ్లు తదితర వాటిలో నీళ్ల నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలం కనుక నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి మలేరియా డెంగ్యు, వంటి వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంటు శ్రీరాములయ్య, వెంకటసుబ్బయ్య, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిసలు కావద్దు



మానసిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఖాజీపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటుపడడంతో వారికుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయన్నారు. చెడు అలవాట్లకు బానిసకాకుండా ఉంటాలంటే 14416 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సలహాలు, సూచనలిస్తారన్నారు. కార్యక్రమంలో సైక్రియాటిస్ట్ సోషియల్ వర్కర్ భాస్కర్, సూపర్‌వైజర్ క్రిష్ణప్రియ, స్టాఫ్ నర్సు సుబ్బయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..పర్యావరణం కాపాడుదాం

మైదుకూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటుదాం,పర్యావరణం కాపాడుదామని వనిపెంట బీసీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. పాఠశాలలో శుక్రవారం లెక్కవారిపల్లె హెడ్‌మాస్టర్ నరసింహులు, ఆధ్వర్యంలో బాలికల చేత మొక్కలు నాటారు. కార్యక్రమంలో నసిరున్నీసాబేగం, పర్యావరణ మిత్ర వెంకటేశ్వర్‌రెడ్డి, అనురాధ, శైలజ, సౌమ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

కొండాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గండ్లూరు గ్రామంలో రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం నాల్గవ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పెన్నాలో జోరుగా నీళ్లు.. గ్రామాల్లో నీటి కష్టాలు



పెన్నానదిలో వరద ప్రవాహం

జమ్మలమడుగు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తున్నా జమ్మలమడుగు పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. గత 15 రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో వర్షాలు అధికంగా కురిసి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి జీఎన్ఎస్ఎస్ కాలువ, ఆపై గండికోట ప్రాజెక్టు, అక్కడి నుంచి మైలవరం జలాశయం, పెన్నానదిలో వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. జూన్, జూలై మాసాల్లో వర్షాలు లేక రైతులు, ప్రజలు వర్షం కోసం ఎదురుచూశారు. తర్వాత ఆగస్టు నెలలో ఆలస్యంగానైనా వర్షాలు బాగాపడడంతో మైలవరం జలాశయం నుంచి ప్రతిరోజు పది వేల క్యూసెక్కులకుపైగా వరద ప్రవాహం కొనసాగుతుంది. అయితే మైలవరం, వేపరాల దొమ్మర నంద్యాల, మోరగుడి, పొన్నతోట, గూడెం చెరువు, అంబవరం, గొరిగెనూరు, తదితర గ్రామాలకు మంచినీటి కోసం పెన్నానదిలో ఏర్పాటు చేసిన బోర్లకు వరద ప్రవాహంతో అధికారుల సూచనల మేరకు గ్రామ పంచాయతీల అధికారులు బోర్ల వద్ద పైపులు, విద్యుత్ వైర్లు తొలగించడంతోఆ గ్రామాలకు మంచినీటి సరఫరా ఆగిపోయింది. ప్రజలు సమీప పొలాల్లో బోర్ల వద్ద నీళ్లను తెచ్చుకుంటున్నారు. దొమ్మరనంద్యాల గ్రామంలో గ్రామ పంచాయతీవారు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నా అవి పూర్తిగా సరిపోవడంలేదని దీంతో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పెన్నానదిలో వరద ప్రవాహం తగ్గే వరకు తాగునీటి కష్టాలు తప్పవని జ్రలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మైలవరం జలాశయం వద్ద నుంచి జమ్మలమడుగుపట్టణ ప్రాంతానికి మంచినీటి సరఫరా చేసే మున్సిపల్ ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంకు నుంచి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా పెన్నానది వరద ప్రవాహంతో వేపరాల నుంచి జమ్మలమడుగు వెళ్లే రహదారులు కోతకు గురయ్యాయి. అలాగే దానవులపాడు వద్ద పెన్నానదిలో రోడ్డు కోతకు గురైంది.

లావనూరు ఆయకట్టుకు నీటి విడుదలతో హర్షం

కొండాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు చెరువు కింద ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తునారు. పైడిపాలెం రిజర్వాయిర్ నుంచి లావనూరు చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఈనెల 4వ తేదీన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి చొరవ తో పైడిపాలెం రిజర్వాయిర్ వద్ద కొత్తగా గేటు ఏర్పాటు చేసి లావనూరు చెరువు ఆయకట్టు కింద నీరందిస్తున్నట్లు మాజీ మార్కెట్ యార్డు చైర్మెన్ వైవీనారాయణరెడ్డి తెలిపారు. పైడిపాలెం రిజర్వాయర్ నుంచి లావనూరు చెరువు కు నీరందించేదుకు సుమారు రూ. 30 లక్షలతో పనులు పూర్తి చేసి అదనంగా గేటు ను నిర్మించారు. అక్కడి నుంచి కాలువ ద్వారా చెరువు కింద ఆయకటుక్టు రైతులకు నీరందిస్తున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యమందించాలి



ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను అప్యాయంగా పలుకరించి మెరుగైన వైద్యం అందించాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సూచించారు. స్థానిక నంద్యాల రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆకస్మిక తనిఖీలు చేసి ఆసుపత్రికి వచ్చే రోగులతో మాట్లాడారు. వైద్యులు కాని,సిబ్బంది వలన ఏమైనా ఇబ్బంది కలుగుతుందా అని అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్ష ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీస్ ఔట్‌పోస్ట్, పోస్టుమార్టం, డయాలసిస్ మంజూరుకు కావలసిన ప్రతిపాదనలను వెంటనే తయారుచేయాలని డాక్టర్లను ఆదేశించారు. త్వరలో మైదుకూరులో వంద పడకల ఆసుపత్రి మంజూరుకు కృషి చేస్తున్నమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, మిల్లు శ్రీను, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మోపూరి రమణ, బండి అమర్‌నాథ్, తుపాకుల రమణ, రేనాడి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న సీడీపీవో ముంతాజ్‌బేగం

చాపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కోసం విద్యార్థులు వారి తల్లిదండ్రులు 1098 నంబరుకు సమాచారం ఇవ్వాలని చాపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ముంతాజ్‌బేగం పేర్కొన్నారు. చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలలకు సంరక్షణ, సహాయంపై సమావేశం లో సీడీపీవో మాట్లాడుతూ అనాథ బాలలు, వీధుల్లో ఉండే బాలలు, మానసిక బాలలు, లైంగిక హింసలకు గురవుతున్న బాలలు ఆపదలో ఉన్నప్పుడు సమాచారం తెలియజేస్తే అధికారులు, పోలీసులు సహాయం చేస్తారన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, హెడ్మాస్టర్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కోడూరులో: మండల పరిధిలోని ఐత్రంపేట, గోవిందాయపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజరు సుగుణ ఆధ్వర్యంలో చైల్డ్‌హెల్ప్‌లైను నెంబరు 1098 గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ హెల్ప్‌లైను నెంబరు గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవా లన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, అనాథ పిల్లలు, వీధిలో వదిలేసిన పిల్లలను గుర్తిస్తే 1098కు కాల్ చేసి సమాచారం తెలుపవచ్చన్నారు. అనంతరం 1098 హెల్ప్‌లైను నెంబరు వాల్‌పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పవద్దు

కలసపాడు,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరంగా ఉంచాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎన్వీ సత్యనారాయణలు పేర్కొన్నారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలో ఎస్టీయూ సభ్యులుగా ఉపాధ్యాయులను చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రకరకాల యాప్‌లు, ఆన్‌లైన్ పనులు, శిక్షణ తరగతులు తదితర బోధనేతర పనులతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారన్నారు. ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా మూల్యాంకన పుస్తకాల పేరుతో మరో గుదిబండను ఉపాధ్యాయుల మెడకు చుట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, ప్రసాద్, బాలరాజు, శివారెడ్డి, బేబీ సరోజ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి మృతి చెందిన కేశవకు కన్నీటి వీడ్కోలు

పోరుమామిళ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):అన్నమయ్య జిల్లా రాజంపేట బాలాయపల్లెసమీపంలో చెయ్యేరు నదిలో ఈతకు వెళ్లి దురదృష్టవశాత్తు మృతి చెందిన పోరుమామిళ్ల శీనప్పబావివీధికి చెందిన చెన్నయ్య కుమారుడు కేశవకు శుక్రవారం బంధువులు, ఆత్మీయుల కన్నీటి వీడ్కోలుతో అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి వారి స్వగృహంకు వెళ్లి కేశవ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ విషాదసమయంలో తాను ఆ కుటుంబానికి పూర్తిగా మద్దతుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అలాగే వైసీపీ అదనపు సమన్వయకర్త నల్లేరువిశ్వనాథరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల ఉప సర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, తమ్మిశెట్టి రఘురామయ్య పాల్గొన్నారు.

ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు గ్రామంలో ఆరు మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని వెంకటమోహన్‌రెడ్డి అనే వ్యక్తి తన ఇంటివద్ద అక్రమంగా మద్యం బాటిళ్లను అమ్ముతుండగా పోలీసులు సీజ్ చేశారు. వాటిని ఎక్సైజ్ అధికారులకు అప్పగించనున్నట్లు కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.